క్లుప్తంగా

ఘనంగా ఆషాఢ ఉత్సవాలు



హోమంలో పాల్గొన్న భక్తులు

పెద్దశంకరంపేట(మెదక్): ఆషాఢ మాసం తొలి ఏకాదశి సందర్భంగా స్థానిక శ్రీరుక్మిణీ విఠలేశ్వరాలయంలో ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం పల్లకిసేవతోపాటు ఆలయంలో హోమం నిర్వహించారు. శుక్రవారం స్వామి కల్యాణోత్సవం, అన్నదానం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

దాతల సహకారం గొప్పది



పనులు ప్రారంభిస్తున్న మాజీ ఎంపీపీ

శివ్వంపేట(నర్సాపూర్): గ్రామాభివృద్ధి కోసం దాతలు అందిస్తున్న సహకారం ఎంతో గొప్పదని మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ అన్నారు. మండల పరిధి ఉసిరికపల్లి చౌరస్తా నుంచి ఎదుల్లాపూర్ గ్రామానికి సంబంధించిన మట్టి రోడ్డు గుంతల మయంగా మారడంతో పలువురు దాతల సహాయంతో చేపట్టిన మరమ్మతులను గురువారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్రబట్టాచార్యులు, సెగల్ స్వచ్ఛంద సంస్థ కో–ఆర్డినేటర్ వేమనారాయణ, గ్రామస్తులు మహేందర్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్ తదితరులు ఉన్నారు. 2018లో లక్షలోపు రుణమాఫీకి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.19,198 కోట్లు అవసరం ఉండగా రూ.12వేల కోట్లు మంజూరు చేసిందన్నారు. ఈ ప్రభుత్వం రూ.7వేల కోట్లు విడుదల చేయడంపై ఎంతో వ్యత్యాసం ఉందని, నిజాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు.

తొలి దళిత ఉపసర్పంచ్ మృతి



పుష్పమ్మ

పాపన్నపేట(మెదక్): మండల పరిధిలోని గాజులగూడెం తొలి దళిత మహిళా ఉప సర్పంచ్ జాజాల పుష్పమ్మ(89) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. 2013 నుంచి 2018 వరకు ఉప సర్పంచ్‌గా కొనసాగారు. గ్రామాభివృద్ధికి కృషి చేశారు. ఆమెకు నలుగురు కుమార్తెలు, ఒక కొడుకు ఉన్నారు. ఆమె మరణంపై ఏడుపాయల చైర్మన్ బాలాగౌడ్, టీఎస్‌డీపీఎల్ డీఈ జనప్రియ సంతాపం వ్యక్తం చేశారు.

వేంకటేశునికి సహస్రనామ పూజ



తులసి దళ పూజలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని మహ్మద్‌నగర్‌లోగల నామాల గుండు వేంకటేశ్వరస్వామికి తొలి ఏకాదశి సందర్భంగా అర్చకుడు మురళీధర ఆచార్యులు నిర్వహించిన లక్ష తులసి దళపూజ, వంద సార్ల వెయ్యి సహస్రనామాల పూజ గురువారం ముగిసింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

హెచ్చరికబోర్డు ఏర్పాటు



బోర్డు ఏర్పాటు చేస్తున్న అధికారులు

మనోహరాబాద్(తూప్రాన్): ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతోందని వచ్చిన ఫిర్యాదు మేరకు ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని కాళ్లకల్ గ్రామ శివారులో సర్వే నంబర్ 368, 369లో ఏడెకరాల 21గుంటల ప్రభుత్వ భూమిని చూపుతూ ప్రభుత్వ హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అతిక్రమించిన వారిపైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఆర్ఐ దీక్షిత్, సర్వేయర్ దత్తస్వరూప్ తదితరులున్నారు.

రేణుక ఎల్లమ్మ ఉత్సవాలు

కౌడిపల్లి(నర్సాపూర్): గౌడసంఘం శ్రీరేణుక ఎల్లమ్మదేవి ఆలయం ఉత్సవాలకు ముస్తాబైంది. గురువారం ఐనోల్ ఒగ్గుపూజారి శేఖర్ బృందం ఆధ్వర్యంలో మైలలు తీసి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాలలో భాగంగా 22న గంగకు పోవుట, ఒగ్గుకథ, 23న ఎల్లమ్మదేవి లగ్గం, ధ్వజస్తంభం పూజ, అమ్మవారికి బోనాలు ఇతర కార్యక్రమాలు ఉంటాయని గౌడసంఘం అధ్యక్షుడు కృష్ణగౌడ్ తెలిపారు. నాయకులు చంద్రం దుర్గాగౌడ్, పుండరీకంగౌడ్, సత్యనారాయణగౌడ్, రమేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పాపన్నపేట(మెదక్): క్షీరాభిషేకం చేస్తున్న సొసైటీ చైర్మన్ రమేశ్



శివ్వంపేటలో నృత్యాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ధూంధాంగా రుణమాఫీ సంబరాలు

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు రుణమాఫీ చేయడంతో జిల్లావ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, రైతులు సంబురాలు నిర్వహించారు. గురువారం రూ.లక్ష రుణం ఉన్న రైతుల బ్యాంక్ ఖాతాల్లో ప్రభుత్వం రుణమాఫీ జమచేయడంతో చాలాచోట్ల సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. టపాసులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. రుణమాఫీ నిధుల విడుదల కార్యక్రమాన్ని ఆయా రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా నాయకులు, రైతులు వీక్షించారు.



టేక్మాల్‌లో..



చిలప్‌చెడ్‌లో..



వెల్దుర్తి: కార్యక్రమాన్ని వీక్షిస్తున్న రైతులు, నేతలు



తూప్రాన్‌లో..



నిజాంపేట(మెదక్): నస్కల్‌లో..

హామీని నిలబెట్టుకున్నాం

పీసీసీ సభ్యుడు మున్నూరు కిషన్

రేగోడ్(మెదక్): రైతుల రుణాలు మాఫీ చేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామని పీసీసీ సభ్యుడు మున్నూరు కిషన్ చెప్పారు. రూ.2లక్షల రుణమాఫీలో భాగంగా మొదటి విడతలో గురువారం రూ.లక్ష రుణాలు మాఫీ చేసినందుకు మండలంలోని ఆయా గ్రామాల్లో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దామోదర రాజనర్సింహ చిత్ర పటాలకు రైతులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ మాట ఇస్తే మడమ తిప్పదని రుణమాఫీనే ఇందుకు నిదర్శనమన్నారు. నిధుల విడుదల చేసిన కార్యక్రమాన్ని టి.లింగంపల్లి రైతు వేదికలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు వీక్షించారు. ఎస్.దిగంబర్‌రావు, యాదగిరి, శంకరప్ప, శ్యాంరావు కులకర్ణి, విజయభాస్కర్, ఎం.నరేందర్, చోటుమియా, ఏఓ జావీద్, ఏఈఓ భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



రేగోడ్: రైతు వేదిక వద్ద ..

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటే

మెదక్‌జోన్: బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వరుసకట్టి కాంగ్రెస్‌లో చేరుతున్నారని, ఆ రెండు పార్టీలు ముమ్మాటికీ ఒక్కటేనని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ పేర్కొన్నారు. గురువారం ఆ పార్టీ కార్యాలయంలో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ బీజేపీ కార్యకర్తలు పోటీచేసి భారీ మెజార్టీతో గెలవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం శ్రీనివాస్, మురళీ యాదవ్, కరణం పరిణిత, శ్రీనివాస్, సతీశ్, వీణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే

చిన్నారులను అంగన్‌వాడీలో చేర్పించండి

టేక్మాల్(మెదక్): మండలంలోని సంగ్యాతండా పంచాయతీలో గురువారం అంగన్‌వాడీ టీచర్‌లు అమ్మమాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. హెచ్‌ఎం ప్రభావతి, ఉపాధ్యాయురాలు రేణుక, అంగన్‌వాడీ టీచర్‌లు యాదలక్ష్మి, దీప, రేణుక తదితరులు పాల్గొన్నారు.

ఆటపాటలతో అంగన్‌వాడీ విద్య

హవేళిఘణాపూర్(మెదక్): ఆటపాటలతో నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించి చిన్నారుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు కృషి చేస్తున్నామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి అన్నారు. హవేళిఘణాపూర్‌లో అంగన్‌వాడీ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ప్రైవేటు వద్దు అంగన్‌వాడీ ముద్దు అంటూ నినాదాలు చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడీలకు పంపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్, ఆయా తదితరులు ఉన్నారు.



టేక్మాల్(మెదక్): అంగన్‌వాడీల ర్యాలీ

రిక్షా కాలనీలో..

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ పట్టణంలోని రిక్షా కాలనీలోగల 1, 2 అంగన్‌వాడీ కేంద్రాల్లో అమ్మమాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలోని పిల్లలతో ర్యాలీ, తల్లిదండ్రుల సమావేశం నిర్వహించినట్లు సీడీపీఓ కృష్ణవేణి తెలిపారు. అంగన్‌వాడీలో అమలవుతున్న సేవల గురించి వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ విజయలక్ష్మి, పోషణ్ అభియాన్ కో ఆర్డినేటర్ కల్యాణి, అంగన్‌వాడీ టీచర్‌లు సురేఖ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు అందజేత

రామాయంపేట(మెదక్): స్థానిక హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గురువారం స్థానిక వ్యాపారి అశోక్ కూతురు డాక్టర్ సింధు నోట్ బుక్కులు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద విద్యార్థులను ఆదుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రవీందర్ గౌడ్, ఉపాధ్యాయులు, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మొక్కలతోనే ప్రకృతి సమతుల్యం



మొక్కలు నాటుతున్న అధికారులు

చేగుంట(తూప్రాన్): వనమహోత్సవంలో భాగంగా గురువారం మండల ప్రత్యేక అధికారి బ్రహ్మాజీ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. మండలంలోని వడియారం ఉన్నత పాఠశాలతోపాటు వివిధ పాఠశాలల్లో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి సమతుల్యత కోసం ప్రతిఒక్కరు మొక్కలను నాటి సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చిన్నారెడ్డి, మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ భూపాల్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శైనీ సువర్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కష్టపడితేనే భవిష్యత్తు

అల్లాదుర్గం(మెదక్): విద్యార్థులు కష్టపడితేనే బంగారు భవిష్యత్తు ఉంటుందని ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ రీజినల్ కో–ఆర్డినేటర్ కొంకా రాజేశ్వర్, ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం అల్లాదుర్గం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ హై స్కూల్ పాఠశాలల్లో గతయేడాది ఉత్తమ మార్కులు సాధించిన డి.మేఘన, ఎ.పూజిత, కె.సాహితి, ఎల్.రాకేశ్, ఎస్.శ్రీకాంత్‌తో పాటు ఇంటర్మీడియెట్‌లో కీర్తన, ఎం.సాత్విక, డి.అరుణకు ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ తరఫున ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు, పారితోషకాన్ని అందించారు. కార్యక్రమంలో ఏరియా ఇన్‌చార్జి బి.సంతోష్, నారాయణఖేడ్ అధ్యక్షుడు నరసింహారెడ్డి, సభ్యులు శ్రీనివాస్, మల్లికార్జున పాటిల్, ప్రిన్సిపాల్ కిషన్, హెచ్‌ఎం ధనుంజయ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **బ్యాంకు సిబ్బందితో ఇబ్బందులు**

శివ్వంపేట(నర్సాపూర్): స్థానిక ఇండియన్ బ్యాంకు సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో ఖాతాదారులు ఇబ్బందులు పడుతున్నారని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి గురువారం ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి సిబ్బంది సమయపాలన పాటించే విధంగా చూడాలని డిమాండ్ చేశారు.

◆ **బటన్స్ కుట్టే శిక్షణ ప్రారంభం**

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రమైన ఐకేపీ కార్యాలయంలో గురువారం మహిళా సంఘాల సభ్యులకు చొక్కాలకు బటన్స్ కుట్టే శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐకేపీ ఏపీఎం లక్ష్మీనర్సమ్మ మాట్లాడుతూ మండల సమాఖ్య ఆధ్వర్యంలో కాజా బటన్స్ కుట్టడంతో మహిళలకు ఉపాధితో పాటు మండల సమాఖ్యకు కమీషన్ నిధి చేకూరుతుందని తెలిపారు. నార్సింగి ఏపీఎం అశోక్‌తోపాటు సీసీలు పాల్గొన్నారు.

◆ **సొంత ఖర్చులతో మరమ్మతులు**

మనోహరాబాద్(తూప్రాన్): ఎన్నో రోజులుగా ప్రధాన వీధిలో వెలగని హైమాస్ట్ లైట్లను మండలంలోని లింగారెడ్డిపేట్‌కు చెందిన యువకుడు చాపల విజయ్ సొంతనిధులు రూ.20వేలతో మరమ్మతులు చేయించి వినియోగంలోకి తెచ్చాడు. ఈ సందర్భంగా గ్రామస్తులు అతడిని అభినందించారు.

◆ **పాదయాత్రికుడికి స్వాగతం**

చిన్నశంకరంపేట(మెదక్): అయోధ్యకు పాదయాత్ర చేస్తున్న అల్వాల్‌కు చెందిన శ్రీనివాస్‌కు నార్సింగి మండల కేంద్రంలో బీజేపీ నాయకులు స్వాగతం పలికారు. గురువారం నార్సింగి మండల కేంద్రానికి చేరుకున్న శ్రీనివాస్‌ను వారు సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు చంద్రశేఖర్, నర్సింహులు, లక్ష్మీనారాయణ, సోమరాజ్ తదితరులు ఉన్నారు.

◆ **నేడు అవగాహన సదస్సు**

శివ్వంపేట(నర్సాపూర్): భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు ఉన్నత పాఠశాల ఆవరణలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు కృషి విజ్ఞాన్ గ్రామీణాభివృద్ధి సంస్థ చైర్మన్ లక్ష్మీకాంతారావు తెలిపారు. సైన్స్, అంతరిక్ష పరిశోధన గురించి అవగాహన పెంచేందుకు ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా విద్యాధికారి రాధాకిషన్ ముఖ్య అతిథిగా హాజరు అవుతున్నట్లు చెప్పారు.

◆ **బైక్ వేలం**

నర్సాపూర్: అబ్కారీ నేరంలో పట్టుబడిన బైక్‌ను శనివారం తమ కార్యాలయ ఆవరణలో వేలం వేస్తామని స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ పద్మ తెలిపారు. ఆరోజు ఉదయం 11గంటలకు వేలం వేస్తామని, వాహనాన్ని ముందుగా వచ్చి పరిశీలించుకోవచ్చని చెప్పారు. వివరాల కోసం తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

సాగునీరు విడుదల చేయండి

● ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్/మెదక్‌జోన్: సాగునీరు విడుదల చేయాలని రాష్ట్ర నీటి పారుదల శాఖమంత్రి ఉత్తంకుమార్ రెడ్డిని కోరినట్లు స్థానిక ఎమ్మెల్యే గురువారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ తాను మంత్రికి లేఖ రాసినట్లు చెప్పారు. సింగూరు నుంచి ఘనపూర్ ఆనకట్టకు రెండు టీఎంసీల సాగునీరు, కొండపోచమ్మ ప్రాజెక్టు నుంచి హల్దీ ప్రాజెక్టుకు ఒక టీఎంసీ సాగునీరు విడుదల చేయాలని కోరినట్లు పేర్కొన్నారు. నీరు విడుదల చేస్తేనే రైతులు తమ వ్యవసాయ పనులు చేసుకోగలుగుతారని వివరించగా మంత్రి సానుకూలంగా స్పందించి ఆదేశాలు ఇస్తానని హామీ ఇచ్చినట్లు సునీతారెడ్డి తెలిపారు. అలాగే మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ పంటల సాగు అదను దాటుతుందని, సాగునీటిని విడుదలచేసి రైతులను ఆదుకోవాలన్నారు. ఆయన సీఎం కార్యాలయ సిబ్బందికి వినతి ప్రతం అందజేశారు.



ఎమ్మెల్యే సునీతారెడ్డి

ఏడో రోజుకు చేరిన రైతుల దీక్షలు

నర్సాపూర్: కొండపోచమ్మ కాలువ వద్దు– సెమీ అర్బన్ ముద్దు అంటూ రైతులు చేపట్టిన రిలే నిరహార దీక్షలు గురువారం నాటికి ఏడో రోజుకు చేరాయి. సంగారెడ్డి రీచ్–2 కాలువకు తమ భూములు ఇవ్వబోమని పలు గ్రామాల రైతులు రిలే నిరహార దీక్షలు చేపట్టిన విషయం తెలిసిందే. గురువారం దీక్షలలో చిన్నచింతకుంట, బ్రాహ్మణపల్లి, జగ్యాతండాలకు చెందిన రైతులు నర్సింహారెడ్డి, రమేశ్, కిషన్, పంతు, పోచయ్య, పెంటయ్య, వెంకటేశ్, రాంకిషన్‌లతోపాటు రైతు రక్షణ సమితి అధ్యక్షుడు యాదాగౌడ్, గౌరవ అధ్యక్షుడు మైసయ్య తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ అమలుపై హర్షం వ్యక్తంచేస్తూ కాంగ్రెస్ నాయకులు పార్టీ ఆఫీసు నుంచి చౌరస్తా వరకు ర్యాలీ, సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం కార్యక్రమాలు చేపట్టారు. తమను పట్టించుకోకుండా నాయకులు సంబరాలకు వెళ్లడంపై దీక్షలో పాల్గొన్న రైతులు నిరసన వ్యక్తం చేశారు.



దీక్షలో పాల్గొన్న రైతులు

చిన్న గుడ్లు వస్తే వెనక్కి ఇవ్వాలి

● ఐసీడీఎస్ సీడీపీఓ స్వరూపరాణి

సాక్షి ఎఫెక్ట్..

చిన్నశంకరంపేట(మెదక్): అంగన్వాడీ కేంద్రాలకు చిన్నసైజు గుడ్లు వస్తే వెనక్కు ఇవ్వాలని రామాయంపేట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ స్వారూపరాణి సూచించారు. మండలంలోని జంగరాయి అంగన్వాడీ కేంద్రంలో గురువారం ఆమె తనిఖీలు నిర్వహించారు. 'చిన్న బోయిన గుడ్డు' శీర్షికన 16న సాక్షిలో వచ్చిన కథనానికి స్పందించిన అంగన్వాడీ కేంద్రంలో గుడ్ల సైజును పరిశీలించారు. గర్భిణులకు అందిస్తున్న పౌష్టికహరంపై ఆరా తీశారు. చిన్నారుల బరువును పరిశీలించారు. కాంట్రాక్టర్ తీసుకువచ్చే గుడ్లను తూకం వేసిన తరువాతనే తీసుకోవాలని సూచించారు. ఆమె వెంట ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి తదితరులు ఉన్నారు.



చిన్నారి బరువును పరిశీలిస్తున్న స్వరూపరాణి

మత్తుకు బానిస కావొద్దు : సీఐ

రామాయంపేట(మెదక్): విద్యార్థులు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని సీఐ వెంకట్‌రాజా గౌడ్ సూచించారు. డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవంలో భాగంగా గంజాయి, ఇతర మత్తు పదార్థాలపై విద్యార్థులకు మోడల్ స్కూల్లో నిర్వహించి అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మత్తుకు బానిసైతే జీవితాలు నాశనమౌతాయని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ రంజిత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అరికట్టడానికి కృషి

మెదక్‌జోన్: మాదక ద్రవ్యాలను అరికట్టడానికి నిరంతరం కృషి చేస్తున్నామని సీఐ నాగరాజు తెలిపారు. డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు డ్రగ్ వ్యతిరేక కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సెమినార్‌లో ఆయన పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ హుస్సేన్, రమణ కుమార్, సుధాకర్, శరత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

చిన్నశంకరంపేట(మెదక్): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్ఐ నారాయణగౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగేందర్ పాల్గొన్నారు.



రామాయంపేట(మెదక్): మాట్లాడుతున్న సీఐ

బానిసలు కావొద్దు

పెద్దశంకరంపేట(మెదక్): యువత మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని ఎస్ఐ శంకర్ పిలుపునిచ్చారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ప్రజలకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. గంజాయి, ఇతర డ్రగ్స్‌కు అలవాటు పడితే ప్రాణాలకు ప్రమాదమని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్ఐ సునీత, విఠల్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ జీతాలు ఇవ్వాలి



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు, యూనియన్ నాయకులు

● సీఐటీయూ నేత మహేందర్ రెడ్డి

నర్సాపూర్: ఆశా వర్కర్లకు నెలకు రూ.18వేలు ఫిక్స్‌డ్ జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గురువారం స్థానిక ఎమ్మెల్యే సునీతారెడ్డి క్యాంపు కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినప్పటికీ సమస్యలను పరిష్కరిచడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెప్పిన విధంగా ప్రజల వద్దకు అన్నికార్యక్రమాలను చేరుస్తున్నా చిన్నచూపు చూస్తున్నారని ఆరోపించారు. ధర్నాలో నాగరాజు, రేణుక, గోపమ్మ, మాధవి, లక్ష్మి, అంజలి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ ఏలో చేర్చాలి

కౌడిపల్లి(నర్సాపూర్)/టేక్మాల్(మెదక్): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముదిరాజ్‌లను బీసీఏలో చేర్చాలని ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు కృష్ణ ముదిరాజ్ డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ ఆంజనేయులుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేయాలన్నారు. చెరువు, కుంటలపై ముదిరాజ్‌లు, మత్స్యకారులు, గంగపుత్రులకు పూర్తిహక్కు కల్పించాలని, ఉచిత చేపపిల్లల కోసం వందశాతం నగదు అందజేయాలని కోరారు. ముదిరాజ్ కార్పొరేషన్‌కు ప్రతియేటా రూ.వెయ్యికోట్లు కేటాయించాలన్నారు. అలాగే 50యేళ్ల వారికి ఆసరా పింఛన్ మంజూరు చేయాలని డిమాండ్ కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రాజు, మల్లేశం, అశోక్, విఠల్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా టేక్మాల్‌లో జరిగిన కార్యక్రమంలో మండల అధ్యక్షులు కె.మాణెయ్య, జిల్లా ఉపాధ్యక్షులు భవాని అంజయ్య, పెంటయ్య, బాగయ్య, నర్సింహులు, ఈశ్వరయ్య, అంజయ్య, గోపాల్, రాములు తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు